సాక్షి ప్రకాశం

మంగళవారం । 7 । జనవరి । 2025



రూ.2 కోట్ల భూమి హాంఫట్

తర్లుపాడు-మార్కాపురం సరిహద్దులో గానుగపెంట వద్ద టీడీపీ నేత ప్రభుత్వ భూమి ఆక్రమణకు పాల్పడ్డాడు. కబ్జా చేసిన భూమిలో పండ్ల మొక్కల సాగు చేశాడు. - 8లో..



వైఎస్సార్ సీపీ నేతల ఇటుక బట్టీలే టార్గెట్

మార్కాపురం మండలం రాయవరంలో వైఎస్సార్ సీపీ నాయకుల ఇటుక బట్టీలను అక్రమంగా తొలగిస్తున్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం 29/20

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. రాత్రికి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

7, 8న మిడ్‌లైన్ పరీక్ష నిర్వహించాలి

ఒంగోలు సిటీ: జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, మెర్జ్ అయిన ఉన్నత పాఠశాలల్లో 3, 4, 5వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు తరల్ మిడ్‌లైన్ పరీక్షను ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహించాలని డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, గణితం సబ్జెక్టుల్లో మిడ్‌లైన్ పరీక్ష నిర్వహించాలని, పరీక్షా ఫలితాలను ఈ నెల 10వ తేదీలోపు ఆన్‌లైన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. మండల విద్యాశాఖాధికారులు వారి పరిధిలోని అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో (ప్రైవేటు మినహాయించి) పరీక్ష నిర్వహించే విధంగా ప్రధానోపాధ్యాయులు తగు ఆదేశాలు జారీ చేయాలన్నారు.

8న ఒంగోలులో జాబ్ మేళా

ఒంగోలు వన్‌టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సిడాప్ సంయుక్తంగా ఈ నెల 8వ తేదీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి జే రవితేజ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులోని ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో నిర్వహించే ఈ జాబ్‌మేళాలో అక్విటాస్ ఈస్టోన్ ప్రైవేట్ లిమిటెడ్, ముత్తూట్ ఫిన్‌కార్ప్, సెలక్ట్ గ్యాడ్జెట్స్, కీర్తి మెడికల్స్ తదితర కంపెనీలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేస్తాయన్నారు. అభ్యర్థులు జిల్లాకు చెందిన వారై ఉండాలని, వయస్సు 19 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకూ అర్హతను బట్టి జీతం ఉంటుందన్నారు. ఇతర పూర్తి వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ సెల్:7989244381 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

14న జిల్లా స్థాయి డ్యాన్స్ పోటీలు


ఒంగోలు సిటీ: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 74వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 14వ తేదీ సాయంత్రం 6 గంటలకు జిల్లా స్థాయి డ్యాన్స్ పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ డ్యాన్స్ పోటీలకు సంబంధించి అభ్యుదయ గేయాలకు మొదటి బహుమతి రూ.3,116, రెండో బహుమతి రూ.2,516, మూడో బహుమతి రూ.1516, ఇతర పాటలకు మొదటి బహుమతి రూ.816, రెండో బహుమతి రూ.516 అందజేస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 7095863125, 9703610685 నంబర్లను సంప్రదించాలని కోరారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ క్యాడిట్ పోటీలకు అంబరీష్ ఎంపిక



ఒంగోలు: జాతీయ స్థాయి ఫెన్సింగ్ క్యాడిట్ అండర్ 17 పోటీలకు పుత్తూరి అంబరీష్ ఎంపికైనట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ముఖ్య కార్యదర్శి జి.నవీన్ తెలిపారు. ఇటీవల కాకినాడలో జరిగిన 10వ రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ క్యాడిట్ విభాగంలో అంబరీష్ బ్రాంజ్‌మెడల్ సాధించాడు. ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రం రుద్రాపూర్ పట్టణంలో జరిగే 19వ జాతీయ స్థాయి ఫెన్సింగ్ క్యాడిట్ అండర్ 17 విభాగంలో అంబరీష్ సత్తాచాటనున్నాడు. స్వగ్రామం చీమకుర్తి కాగా ప్రస్తుతం ఒంగోలులో 9వ తరగతి చదువుతున్నాడు. ఈ సందర్భంగా అంబరీష్‌ను ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు, కోచ్‌లు జి.భరత్, ఆర్.విజయలక్ష్మి, డి.రాజు ప్రత్యేకంగా అభినందించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీలో సత్తా చాటిన జ్యోత్స్నప్రియ



పెద్దారవీడు: గత నెలలో 50వ అంతర జిల్లాల రాష్ట్ర స్థాయి ప్రావిన్స్ కబడ్డీ పోటీలో దేవండ్ల జ్యోత్స్నప్రియ పాల్గొని ఉత్తమ ప్రతిభ చాటిందని ప్రధానోపాధ్యాయుడు షేక్ అహ్మద్ సోమవారం తెలిపారు. మండలంలో ఏనుగులదిన్నెపాడు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని జ్యోత్స్నప్రియ ప్రకాశం జిల్లా కబడ్డీ జట్టు తరఫున తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ప్రావిన్స్ కబడ్డీ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రదర్శన కనబరిచిందని తెలిపారు. గత నెలలో బాపట్ల జిల్లా పిట్లవారిపాలెంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలో కూడా ఉత్తమ ప్రదర్శనతో రాష్ట్రస్థాయి ప్రావిన్స్ జట్టుకు ఎంపికై oదని చెప్పారు. విద్యార్థినికి కబడ్డీలో ఉత్తమ శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు దేవండ్ల చంద్రయ్య, పీఈటీ సురేష్‌లను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

కరోనా మహమ్మారి విధ్వంసం ఇంకా కళ్లముందు మెదులుతూనే ఉంది. ఈ గడ్డుకాలంలో ప్రజలు అల్లాడిపోయారు. కరోనా వైరస్‌ను పోలిన హ్యూమన్ మెటానిమోవైరస్ (హెచ్‌ఎంపీవీ) కేసులు బెంగళూరు, అహ్మదాబాద్ నగరాల్లో వెలుగు చూడడంతో జిల్లా వాసులు ఉలిక్కిపడ్డారు. చిన్నారులు, వృద్ధులపై ప్రభావాన్ని చూపే ఈ వైరస్‌తో ముప్పేమీ ఉండదని, అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కరోనా సమయంలో నాటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న జాగ్రత్తలను జిల్లా వాసులు గుర్తు చేసుకుంటున్నారు.

మేల్కొందాం.. బయటపడదాం..!

- బెంగళూరు, అహ్మదాబాద్‌ల్లో చిన్నారులకు హెచ్‌ఎంపీవీ వైరస్
- మాస్కులు ధరించడం..రద్దీ ప్రాంతాలకు దూరంగా ఉండాలంటున్న వైద్యులు

- ఉలిక్కిపడిన జిల్లా ప్రజలు
- అప్రమత్తతే దివ్య ఔషధం అంటున్న వైద్య నిపుణులు
- కరోనా సమయంలో జగన్ తీసుకున్న జాగ్రత్తలను గుర్తుచేసుకుంటున్న జిల్లా వాసులు



సాక్షి ప్రతినిధి, ఒంగోలు: అందరూ భయపడుతున్నట్టుగానే హ్యూమన్ మెటా న్యూమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) మన దేశంలోకి అడుగుపెట్టింది. బెంగళూరు, అహ్మదాబాద్‌లో ముగ్గురు చిన్నారులకు వైరస్ సోకిందన్న వార్తలు వచ్చిన నేపథ్యంలో జిల్లా వాసులు ఆందోళనకు గురయ్యారు. నాటి కరోనా రోజులను గుర్తు చేసుకుంటూ భయంతో వణికిపోతున్నారు. 2019లో వచ్చిన కరోనా ప్రభావం కంటే 2021లో రెండో విడత వచ్చిన వైరస్‌తో పెద్ద ఎత్తున ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకున్న జాగ్రత్తలతో మృతుల సంఖ్యను భారీగా తగ్గించగలిగింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యవసర వైద్యసేవలను అందుబాటులోకి తీసుకొచ్చి ప్రజలకు భరోసానిచ్చింది. జిల్లాలో రెండో విడతలో 2022 మే నెలాఖరుకు సుమారు అధికారిక లెక్కల ప్రకారం 1,55,941 మంది ఈ మహమ్మారి బారిన పడ్డారు. అందులో 1,54,794 మంది కోలుకున్నారు. సుమారు 1147 మంది ప్రాణాలు కోల్పోయారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కరోనాను ఎదుర్కొన్న తీరు, వలంటీర్ల ద్వారా ప్రజలకు అందించిన సేవల గురించి చెప్పుకుంటున్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులో రెడ్ జోన్ విధించినా ఏ ఒక్కరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుందని చెబుతున్నారు.

జిల్లాలో వనరులు ఇలా..

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాలో ప్రభుత్వ వైద్యశాలల రూపురేఖలు మారిపోయాయి. జిల్లా కేంద్రం ఒంగోలులో సర్వజన ఆస్పత్రి, మార్కాపురంలో జిల్లా ఆస్పత్రి, గిద్దలూరు, యర్రగొండపాలెంలలో ఏరియా ఆస్పత్రులు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 64 ప్రాథమిక వైద్యశాలలు ఉండగా ఒక్కో పీహెచ్‌సీకి ఇద్దరు చొప్పున 128 మంది డాక్టర్లు ఉన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలు 19 ఉండగా, ఒంగోలులో 8 ఉన్నాయి. ఈ ఆస్పత్రుల్లో కూడా పూర్తిస్థాయి సిబ్బంది పనిచేస్తున్నారు. ఒంగోలులోని మాతా శిశు వైద్యశాలలో ఆరుగురు పీడియాట్రీషియన్లు ఉన్నారు. ఇక్కడ నెబులైజేషన్, ఆక్సిజన్, ఔషధాలు అందుబాటులో ఉన్నాయని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంధ్య తెలిపారు. జిల్లా సర్వజన ఆస్పత్రిలో శ్వాస కోశ వ్యాధుల విభాగంలో ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నారు. హెచ్‌ఎంపీవీ వైరస్ చాపకింద నీరులా విస్తరిస్తున్న నేపథ్యంలో జీజీహెచ్‌లోని శ్వాసకోశ విభాగాన్ని **అప్రమత్తం చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ జమున** చెప్పారు.

నాటి ముందు చూపు

కరోనా కనిపించిన కొత్తలో ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు చేయడానికి రోజుల సమయం పట్టేది. దాంతో చికిత్స ఆలస్యమై ప్రాణాలు గాలిలో కలిసి పోయేవి. దీంతో నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వెంటనే ఒంగోలు, మార్కాపురం, కందుకూరులో వైరాలజీ లేబొరేటరీలను ఏర్పాటు చేసింది. దాంతో ఎక్కడికక్కడ ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు చేసి అవసరమైన వైద్య సేవలు అందించడం ద్వారా ప్రజల ప్రాణాలను కాపాడింది. అంతేకాకుండా ఒంగోలులోని జీజీహెచ్‌లో రెండంతస్తులను కరోనా రోగులకు కేటాయించడం, ఆస్పత్రి ఆవరణలో ఇండో అమెరికన్ ఆధ్వర్యంలో ఐసోలేషన్ పడకలతో కూడిన ప్రత్యేక గదులు ఏర్పాటు చేసింది. అంతేకాకుండా మూడు ఆక్సిజన్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసి జీజీహెచ్‌లోని అత్యవసర వార్డులకు అనుసంధానం చేసింది. దాంతో ఒకేసారి వందల మందికి అవసరమైన ఆక్సిజన్ అందించే వెసులుబాటు కలిగింది. అనేక మంది ప్రాణాలతో బయటపడ్డారు.

ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం



హెచ్‌ఎంపీవీ వైరస్ గురించి అన్ని రకాల ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం. గ్రామస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ స్థాయిలో అర్బన్ హెల్త్ సెంటర్లు, ఏరియా వైద్యశాలలకు చెందిన వైద్యులు, ఇతర సిబ్బందిని అప్రమత్తం చేస్తాం. జిల్లాలో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సంసిద్ధంగా ఉంది. ఇప్పటికైతే మన రాష్ట్రంలో ఎలాంటి కేసులు నమోదు కాలేదు.

– డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌ఓ

అప్రమత్తతే ఔషధం...



హెచ్‌ఎంపీవీ వైరస్ సోకకుండా ఉండాలంటే కరోనా సమయంలో తీసుకున్న జాగ్రత్తలే నేడు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. మాస్క్ ధరించడం, తరచుగా చేతులు కడుక్కోవడం, రద్దీ ప్రాంతాలకు వెళ్లకుండా దూరంగా ఉండడం, తగినంత పౌష్టికాహారం తీసుకోవడం లాంటి జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. అంతేకాకుండా వైరస్ లక్షణాలు కనిపించిన వెంటనే క్వారంటైన్‌లో ఉండాలి.



వ్యాధి లక్షణాలు ఇలా..

హెచ్‌ఎంపీవీ వైరస్ లక్షణాలు దాదాపుగా కరోనా లక్షణాలను పోలి ఉంటుంది. దీనిని కూడా శ్వాస కోశ సంబంధిత వ్యాధిగానే నిపుణులు చెబుతున్నారు. జలుబు, దగ్గు, తుమ్ములు, గొంతులో మంట, జ్వరం తదితర లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి తీవ్రంగా ఉన్నప్పుడు పిల్లికూతలతో పాటు శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉంటుంది. న్యూమోనియా, ఆస్తమా లాంటి శ్వాస కోశ సమస్యలను పోలి ఉంటుంది. అనుమానిత లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని క్వాలిఫైడ్ వైద్యుడిని సంప్రదించాలని నిపుణులు చెబుతున్నారు. ఈ వైరస్ ఎక్కువగా వృద్ధులు, చిన్నారుల్లో కనిపిస్తుంది. ప్రస్తుతం బెంగళూరు, అహ్మదాబాద్‌లో వెలుగుచూసిన మూడు కేసులూ సంవత్సరంలోపు చిన్నారులవే. ఈ వైరస్ 0 నుంచి 5 సంవత్సరాలలోపు చిన్నారుల్లోనూ, 55 నుంచి 60 సంవత్సరాలు దాటిన వృద్ధుల్లో, షుగర్, కేన్సర్ లాంటి దీర్ఘకాలిక **వ్యాధులతో బాధ పడుతు**న్న వారిలోనూ **ఎక్కువగా ప్రభావం** చూపిస్తుందని **వైద్యులు** తెలిపారు. **వ్యాధి** నిరోధక శక్తి **తక్కువగా** ఉండే **వారు** ముందస్తు జాగ్రతలు తీసుకుంటే చాలని వైద్యులు చెబుతున్నారు. కరోనా వైరస్ చిన్న పిల్లలను ఇబ్బంది పెట్టలేదు, కానీ ఈ హెచ్ ఎంపీవీ వైరస్ **మాత్రం** చిన్నపిల్ల**లపై** ఎక్కువ **ప్రభావం** చూపించడం **గమనార్హం.**

ఎస్సీ ఉపకులాలపై సమగ్ర వివరాలివ్వండి



రాజీవ్ రంజన్ మిశ్రాకు సమస్యలు వివరిస్తున్న మాల సంఘాల నాయకులు



వినతిపత్రం ఇస్తున్న మాదిగ సంఘాల నాయకులు

- ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా
- మిశ్రాకు వినతులు అందజేసిన మాల, మాదిగ సంఘాల నాయకులు



మాట్లాడుతున్న రాజీవ్ రంజన్ మిశ్రా, పక్కన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ఎస్సీ ఉపకులాల వారీగా సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులపై కచ్చితమైన గణాంకాలతో సమగ్ర వివరాలు అందజేయాలని ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా జిల్లా యంత్రాంగాన్ని కోరారు. జిల్లా పర్యటనలో భాగంగా కమిషన్ చైర్మన్ మిశ్రా సోమవారం ఉదయం గ్రీవెన్స్ హాలులో జిల్లాకు సంబంధించి ఎస్సీల్లోని ఉపకులాల వారీగా జనాభా, వారి స్థితిగతులపై కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, ఇతర జిల్లా అధికారులతో సమీక్షించారు. దీనిలో కలెక్టర్ జిల్లాలోని ఎస్సీ ప్రజల గణాంకాలను కమిషన్ చైర్మన్‌కు వివరించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 56 మండలాలు ఉన్నాయని, వాటిలో ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో 38 మండలాలు ఉండగా బాపట్ల జిల్లాలో 13 మండలాలు, నెల్లూరు జిల్లాలో 5 మండలాలు ఉన్నాయని వివరించారు. 2011 జనాభా లెక్క ప్రకారం ఉమ్మడి జిల్లాలో మొత్తం జనాభా 33,97,448 మంది ఉండగా, వారిలో ఎస్సీ జనాభా 7,87,861 మంది ఉన్నట్లు తెలిపారు. అందులో పురుషులు 3,97,242, స్త్రీలు 3,90,619 మంది ఉన్నారన్నారు. ఎస్సీ అక్షరాస్యత జనాభా మొత్తం 4,10,946 ఉండగా, పురుషులు 2,40,551 మంది, మహిళలు 1,70,395 మంది ఉన్నారని తెలిపారు. ఎస్సీ అక్షరాస్యత శాతం మొత్తం 59.75 ఉందని తెలిపారు. ఉద్యోగుల్లో ఎస్సీల్లో అన్ని ఉపకులాలతో కలిసి మొత్తం 36,669 మంది ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. అందులో మాల కులానికి సంబంధించి 21,739 మంది, మాదిగ కులానికి సంబంధించి 14,770 మంది ఉండగా, ఇతర ఉపకులాల ఉద్యోగులు 160 మంది ఉన్నట్లు తెలిపారు. అదే విధంగా రాజకీయ పరంగా మున్సిపాలిటీల్లో మాల కులంలో 23 మంది, మాదిగ కులంలో 13 మంది వివిధ పదవుల్లో ఉన్నారని వివరించారు. పంచాయతీల్లో మాల కులం నుంచి 1386, మాదిగ కులంలో 1867 మంది, ఉపకులాల నుంచి ఐదుగురు వివిధ పదవుల్లో ఉన్నట్లు కలెక్టర్ కమిషన్‌కు వివరించారు.

ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఉత్తర్వు, కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఉపకులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులపై అధ్యయనానికి ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేసిందని అన్నారు. జిల్లా స్థాయిలో ఎస్సీల్లోని 59 ఉపకులాల పరిస్థితిపై అధ్యయనం నిర్వహించినట్లు చెప్పారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమ శాఖల్లో పనిచేస్తున్న ఎస్సీ ఉద్యోగుల వివరాలను క్యాడర్, ఉపకులాల వారీగా కచ్చితమైన గణాంకాలతో సమాచారం అందజేయాలన్నారు. అదేవిధంగా స్థానిక సంస్థల్లో ఎస్సీల ప్రజాప్రాతినిధ్యంపై ఉపకులాల వారీగా సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎస్పీ ఏఆర్ దామోదర్, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, డీఆర్‌ఓ ఓబులేసు, ఒంగోలు, కనిగిరి ఆర్‌డీఓలు లక్ష్మీప్రసన్న, కేశవర్ధన్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవి, ఇతర అధికారులుల పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయాలని ఒకరు... చేస్తే నష్టమని మరొకరు వినతి

ఎస్సీ వర్గీకరణ చేయాలని ఒకరు.. చేస్తే తమకు నష్టం వాటిల్లుతుందని మరొకరు విడివిడిగా ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్ మిశ్రాకు వినతులు అందజేశారు. ఆ మేరకు ఎస్సీ కులాలు, ఉపకులాల వర్గీకరణపై రాజీవ్ రంజన్ మిశ్రా సోమవారం గ్రీవెన్స్ హాలులో ఎస్సీ ఉపకులాల ప్రజలు, కుల సంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకుల అభిప్రాయాలు, వినతులు స్వీకరించారు. మాల, మాదిగ కులాలకు చెందిన పలు సంఘాల నాయకులు, ప్రజలు భారీగా తరలివచ్చి కమిషన్ చైర్మన్‌కు వారి అభిప్రాయాలను తెలిపారు. దీనిలో మొత్తం 355 అర్జీలు మిశ్రాకు అందజేశారు.

మాదిగ కుల సంఘాల నాయకులు ఎస్సీ వర్గీకరణ చేయాలని, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. అంతేకాకుండా ఎస్సీ కుల గణన మొత్తం తప్పుల తడకగా ఉందని, మాదిగలను క్రిస్టియన్ మాదిగగా కాకుండా హిందూ మాదిగగా నమోదు చేయాలని కోరారు. వర్గీకరణతో మాదిగలకు న్యాయం జరుగుతుందని తెలుపుతూ మాదిగ కుల సంఘాల నాయకులు మిశ్రాకు అర్జీలు అందజేశారు.

మాల కుల సంఘాల నాయకులు మాత్రం అందుకు భిన్నంగా వర్గీకరణ సజావుగా చేయకుంటే ఎస్సీలంతా నష్టపోతారని రాజ్యాంగం ప్రకారం మాత్రమే వర్గీకరణ చేయాలన్నారు. కుల గణన నిబంధనల ప్రకారం చేయాలన్నారు. వర్గీకరణకు సంబంధించి పలు రాష్ట్రాల్లో కోర్టుల తీర్పులను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. సోషల్ ఆడిట్ పూర్తి తప్పుల తడకగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల పింఛన్లు పంపిణీ చేస్తూ దళితుల ఇళ్ల వద్ద త్వరలో వర్గీకరణ చేస్తారని.. మీకు న్యాయం జరుగుతుందని అనడం సిగ్గుచేటన్నారు. వర్గీకరణ జరిగినట్లు భవిష్యత్తు చెప్పిన సీఎం మీతో ఏక సభ్య కమిషన్ ఎందుకు ఏర్పాటు చేశాడని కమిషన్ చైర్మన్‌ను ప్రశ్నించారు. వర్గీకరణ రాజ్యాంగ బద్ధంగా లేకుంటే కోర్టులను ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

వినతులు అందజేసిన వారిలో మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టీ అశోక్, ఉపాధ్యక్షుడు గోపినాథ్, కోశాధికారి యరమాల మల్లికార్జునరావు, మాల సంఘాల జేఏసీ నాయకులు అన్నవరపు కిషోర్ ఇతర నాయకులు తిరుపతి స్వామి, పిల్లి మాల్యాద్రి, తోటకూర బాబురావు, మాల మహానాడు అధ్యక్షుడు బిళ్లా చెన్నయ్య, ఇతర మాల సంఘాల నాయకులు బిళ్లా వసంతరావు, యరజర్ల రమేష్, ప్రభాకర్‌రావు, శ్రీనివాసరావు ఉన్నారు. మాదిగ కుల, ఉద్యోగ సంఘాల నాయకులు ఎంఆర్‌పీఎస్ నాయకులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ, మాదిగ సంక్షేమ పోరాట సమితి అధ్యక్షుడు కొమ్ము సుజన్ మాదిగ ఇతర నాయకులు ఆంజనేయులు, ఆనంద్‌మాదిగ, బాబు, గుంటూరు ప్రభాకర్ ఇతర ఉప కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రసవ మరణాలు తగ్గించడమే లక్ష్యం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వర్లు




మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు

ఒంగోలు టౌన్: ప్రసవ సమయంలో మాతృ, శిశు మరణాలు జరగకుండా ఏఎన్‌ఎంలు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు చెప్పారు. సోమవారం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో కాన్పు సమయంలో అధిక ప్రమాదం కలిగిన మహిళలకు సంబంధించి గర్భధారణ నియమాలపై నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. అధిక రక్తపోటు, మధుమేహం, ఎపిలెప్సి, ప్రసవ సమయంలో అధిక రక్త స్రావం కలిగిన ప్రమాదకర సంకేతాలు కలిగిన గర్భిణీలను గుర్తించి సకాలంలో వారికి సరైన వైద్య సేవలు అందించాలని సూచించారు. గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు ఎంసీపీ కార్డు, ఆర్‌సీహెచ్ రిజిస్టర్ పోర్టల్, అభా డిజిటల్ యాప్‌లో నమోదు చేయాల్సిందిగా ఆదేశించారు. టీబీ, లెప్రసీతో బాధ పడుతున్న వారిని సకాలంలో గుర్తించి వారికి తక్షణ వైద్యం అందించాలని జిల్లా టీబీ, లెప్రసీ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ ఆదేశించారు. శిశువులు, గర్భిణులలకు క్రమం తప్పకుండా టీకాలు వేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి డాక్టర్ పద్మజ చెప్పారు. అంగన్‌వాడీ పిల్లలకు, స్కూలు పిల్లలకు వారి పరిధిలోనే వైద్య పరీక్షలు నిర్వహించడం ద్వారా పుట్టుకతో లోపాలను నిర్ధారించి ఒంగోలు, మార్కాపురంలోని ఎర్లీ ఇంటర్‌వెన్షనల్ సెంటర్‌కు రెఫర్ చేయాలని ఎన్‌సీడీ జిల్లా నోడల్ అధికారి డా.భగీరథి చెప్పారు. ఈ శిక్షణలో అర్మాన్ సంస్థ ప్రతినిధి డాక్టర్ చరణ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ప్రదర్శించారు. కార్యక్రమంలో డీపీహెచ్‌ఎన్‌ఓ సుగుణమ్మ, మాస్ మీడియా అధికారి డి.శ్రీనివాసులు, హెల్త్ ఎడ్యుకేటర్ కె.శ్రీదేవి, ఎంఐఎస్ టి.శ్రీధర్ పాల్గొన్నారు.

స్వీయ అభ్యసనకు పాల్‌ల్యాబ్స్ ఉపయుక్తం

- డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్



శిక్షణలో మాట్లాడుతున్న డీఈఓ కిరణ్‌కుమార్

ఒంగోలు సిటీ: విద్యార్థులను స్వీయ అభ్యసన దిశగా తీసుకెళ్లేందుకు పాల్‌ల్యాబ్స్ ఉపయోగపడతాయని డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం ప్రకాశం, బాపట్ల జిల్లాలోని 32 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలకు చెందిన ప్రిన్సిపాల్స్, బోధనా సిబ్బంది 128 మందికి స్థానిక రామ్‌నగర్‌లోని మున్సిపల్ హైస్కూల్‌లో పాల్‌ల్యాబ్స్ కు సంబంధించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ శిక్షణ జరుగుతున్న తీరు పరిశీలించి, పాల్‌ల్యాబ్స్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులు పాల్‌ల్యాబ్స్ వినియోగించేటట్లు టైంటేబుల్ ఏర్పాటు చేసి వారంలో ఒక రోజు ఇంటర్‌నెట్ కనెక్టు చేసి రిపోర్టు జనరేట్ అయ్యేట్లు చూడాలని సిబ్బందికి తెలిపారు. పాల్‌ల్యాబ్స్ వినియోగంలో జిల్లా ప్రథమ స్థానంలో ఉండాలని సూచించారు. ప్రతి పాఠశాలకు 30 చొప్పున 840 ట్యాబులును పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ చంద్రమౌళీశ్వరరావు, ఒంగోలు ఎంఈఓ టి.కిషోర్‌బాబు కోర్సు డైరెక్టరుగా వ్యవహరించారు. శిక్షణా కార్యక్రమం పరిశీలనకు స్టేట్ అబ్జర్వర్ డి.మాధవీలత, సమగ్రశిక్ష సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

10న జిల్లా స్థాయి సబ్ జూనియర్ హాకీ జట్ల ఎంపిక

సంతనూతలపాడు: జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10 తేదీ సంతనూతలపాడు మండలంలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా సబ్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ హాకీ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు ఏవీ.రమణారెడ్డి, కార్యదర్శి ఏ.సుందర రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హాకీ పట్ల ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం తీసుకొని పదో తేదీ ఉదయం 9 గంటలకు రావాలన్నారు. ఎంపికైన సబ్ జూనియర్ బాయ్స్ జట్టు ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు మదనపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన గర్ల్స్ జట్టు ఈనెల 27 నుంచి 29 వరకు అనంతపురం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ ఎంపికలకు వచ్చేవారు 11-2009 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. పూర్తి వివరాలకు పీఈటీ తిరుమలశెట్టి రవికుమార్ 9666067764 ను సంప్రదించాలని తెలిపారు.

క్లుప్తంగా

తుది ఓటర్ల జాబితా విడుదల



తుది ఓటర్ల జాబితా సీడీలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేస్తున్న డీఆర్‌ఓ

ఒంగోలు అర్బన్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో తుది ఓటర్ల జాబితాను సోమవారం స్థానిక ప్రకాశం భవనంలో జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) ఓబులేసు విడుదల చేశారు. అనంతరం ఓటర్ల జాబితా సీడీలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. ఓటర్ల తుది జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 2,183 పోలింగ్ కేంద్రాల పరిధిలో 18,19,448 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుష ఓటర్లు 9,05,885 మంది ఉండగా, మహిళా ఓటర్లు 9,13,450 మంది ఉన్నారు. థర్డ్ జెండర్ ఓటర్లు 113 మంది ఉన్నారు. సీడీలు అందుకున్న వారిలో వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు రసూల్, సత్యం, వెంకట్రావు ఉన్నారు. కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ నుంచి రాజశేఖర్‌రెడ్డి, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తాపడి ఏడుగురికి గాయాలు



వైద్యశాలలో చికిత్స పొందుతున్న అంజమ్మ



గాయపడిన నాగమణి

యర్రగొండపాలెం: ఆటో బోల్తాపడి ఏడుగురికి గాయాలైన సంఘటన స్థానిక పుల్లలచెరువు రోడ్డులోని పెట్రోలు బంకు సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. పొగాకు పచ్చాకు కొట్టేందుకు యర్రగొండపాలెం నుంచి పుల్లలచెరువు మండలంలోని చెన్నంపల్లికి ఆటోలో కూలీలను తరలిస్తున్నారు. ఆ సమయంలో మలుపు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ సంఘటనలో పార్వతమ్మ, గుర్రం మల్లేశ్వరి, తిరుమలశెట్టి నాగమ్మ, భూలక్ష్మి, కోటేశ్వరి, బి.అంజమ్మ, శ్రీలక్ష్మికి గాయాలయ్యాయి. వీరు స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. వారిలో పార్వతమ్మ పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో నరసరావుపేట తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

కురిచేడు: విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని పడమరనాయుడుపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎస్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న పఠాన్ కరిముల్లా విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, మరికొందరు విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు విచారణ జరిపిన ఎంఈఓ వస్త్రాంనాయక్ జిల్లా ఉన్నతాధికారులకు ఇచ్చిన నివేదిక ఆధారంగా ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు డీఈఓ తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

కంభం: పదిహేనేళ్ల బాలిక అదృశ్యమవడంపై కేసు నమోదు చేసినట్లు కంభం ఎస్సై నరసింహారావు తెలిపారు. బేస్తవారిపేట మండలం గొట్లమిండ్ల గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని సోమవారం కంభం వచ్చి తిరిగి ఇంటికి చేరలేదు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

'రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యలపై వచ్చిన ప్రతి అర్జీని పరిశీలన చేయిస్తున్నాం. ప్రతి అర్జీకి పరిష్కార మార్గం కనుగొంటాం. ఎక్కడైనా భూ కబ్జాలకు పాల్పడితే ఆ నా కొ..లను జైల్లో వేయించి బయటకు రాకుండా చేస్తాం' ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో మార్కాపురం టీడీపీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలివి.

ఎమ్మెల్యే మాటలంటే భయం లేదో.. అధికారులంటే లెక్కలేదో తెలియదు కానీ మార్కాపురం మండలం రాయవరానికి చెందిన ఓ టీడీపీ నేత బరితెగించాడు. రూ2 కోట్ల విలువైన పదెకరాల ప్రభుత్వ భూమిని యథేచ్ఛగా కబ్జా చేశాడు.

మేతబీడు భూములపై వాలిన పచ్చగద్ద

- తర్లుపాడు–మార్కాపురం సరిహద్దులో గానుగపెంట వద్ద టీడీపీ నేత భూ ఆక్రమణ
- కబ్జా చేసిన భూమిలో దర్జాగా పండ్ల మొక్కల సాగు
- ఏమీ తెలియనట్లు నిద్ర నటిస్తున్న రెవెన్యూ అధికారులు



రాయవరం–గానుగపెంట ప్రధాన రహదారిలో ఆక్రమణకు గురైన మేత బీడు భూమి

రూ.2 కోట్ల భూమి హాంఫట్!

తర్లుపాడు:

భూకబ్జాలకు పాల్పడితే సహించేది లేదంటూ అమరావతి నుంచి అన్ని స్థాయిల్లో టీడీపీ చేస్తున్న హెచ్చరికలు కేవలం మాటలకే పరిమితమయ్యాయి. క్షేత్రస్థాయిలో ఆ పార్టీ నాయకులు అధికారమే అండగా భూకబ్జాలతో చెలరేగుతున్నారు. మరోవైపు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తూ గత ప్రభుత్వంలో చేసిన భూ ఆక్రమణలను తొలగిస్తామని గొప్పలు చెబుతున్న రెవెన్యూ అధికారులు.. టీడీపీ నేతలు చేస్తున్న భూ ఆక్రమణలపై కిమ్మనకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందే తడవుగా కొందరు టీడీపీ నేతలు ప్రభుత్వ భూములను కబ్జా చేయడమే లక్ష్యంగా పావులు కదిపారు. గడిచిన ఏడు నెలలుగా రెవెన్యూ అధికారులు, సిబ్బందిని బెదిరిస్తూ, ఆమ్యామ్యాలు ముట్టజెపుతూ స్థిరాస్తులను పెంచుకుంటున్న తీరు సర్వత్రా చర్చనీయాంశమైంది. ప్రభుత్వ భూమి కనిపిస్తే దున్నుకోవడం, సాగుచేసుకోవడం పరిపాటిగా మారింది.

విలువైన భూమి.. కనిపించలేదా ఏమి?

మార్కాపురం–తర్లుపాడు సరిహద్దుల్లోని గానుగపెంట గ్రామ శివార్లలో ఉన్న ప్రభుత్వ భూమిపై మార్కాపురం మండలం రాయవరం గ్రామానికి చెందిన ఒక టీడీపీ నేత కన్నేశాడు. గానుగపెంట సర్వే నంబర్ 10–1లో 168.4 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. రెవెన్యూ రికార్డుల్లో పశువుల బయలుగా నమోదైన ఈ భూమిపైనే ఇప్పుడు టీడీపీ నేతల కన్ను పడింది. మార్కాపురం రైల్వేస్టేషన్ నుంచి గానుగపెంట మీదుగా పోతలపాడు వెళ్లే మార్గంలో 10 ఎకరాల ప్రభుత్వ భూమిని టీడీపీ నేత ఆక్రమించాడు. కబ్జా చేసిన మేతబీడు భూమిని జేసీబీలతో దర్జాగా దున్ని కొబ్బరి, మామిడి మొక్కలు నాటాడు. కొంత కాలం క్రితం భూఆక్రమణపై ఆరోపణలు రావడంతో 'ఇది ప్రభుత్వ భూమి'అని రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయినా సదరు టీడీపీ నేత లెక్కచేయకుండా ఆ భూమిని సాగులోకి తెచ్చుకున్నాడు. ఈ ఆక్రమణ బాగోతం గురించి అధికారులకు ముందుగానే పూర్తి సమాచారం తెలిసినా అధికార పార్టీ నేత కావడంతో చేష్టలుడిగి చోద్యం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. భూ కబ్జాపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ తర్లుపాడు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడంలో మతలబు ఏమిటో వారికే తెలియాలి. ఇప్పటికైనా సబ్ కలెక్టర్, కలెక్టర్ స్పందించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడంతోపాటు ఆక్రమణకు పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రభుత్వ భూమిగా బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు(ఫైల్)

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

- నిద్రమత్తులో మహిళను ఢీకొట్టిన కారు డ్రైవర్
- హార్వెస్టర్ ఢీకొని మరో యువకుడు మృతి



గంగమ్మ మృతదేహం



మృతిచెందిన సుధీర్

కొనకనమిట్ల: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళను వెనక నుంచి కారు ఢీకొట్టడంతో ఆమె తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన 565 జాతీయ రహదారిపై కొనకనమిట్ల మండలం ఎదుర్రాళ్లపాడు సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. ఎదుర్రాళ్లపాడు గ్రామానికి చెందిన నాగం గంగమ్మ(47) పొలంలో పని చూసుకుని ఇంటికి బయలుదేరింది. హైవే పక్కన నడుచుకుంటూ వెళ్తున్న గంగమ్మను మార్కాపురం నుంచి పొదిలి వైపు వెళ్తున్న కారు డ్రైవర్ నిద్రమత్తులో ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన గంగమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. కారు అదుపుతప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న వారికి ఎటువంటి గాయాలు కాలేదు. మృతురాలికి భర్త చినకొండయ్య, నలుగురు పిల్లలు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని కొనకమిట్ల పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదంపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

దర్శి: రోడ్డు ప్రమాదంలో ఓర్సు సుధీర్ (24) అనే యువకుడు మృతి చెందగా, ఆకాశ్ అనే యువకుడు గాయాలపాలయ్యాడు. ఈ సంఘటన దర్శి–మోటుపల్లి రోడ్డులో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మోటుపల్లి గ్రామానికి చెందిన సుధీర్, ఆకాశ్‌లు మోటారు సైకిల్‌పై దర్శి వస్తున్నారు. దారి మధ్యలో హార్వెస్టర్ మిషన్‌ల లారీ ర్యాంప్ తగిలి మోటారు సైకిల్ పైనుంచి ఇద్దరూ కిందపడి తీవ్ర గాయాలపాలయ్యారు. 108కు ఫోన్ చేయగా, ఈఎంటీ బాలకృష్ణ, పైలెట్ నరేష్ వారికి ప్రథమ చికిత్స అందించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. కానీ, మార్గం మధ్యలోనే సుధీర్ మృతి చెందగా, ఆకాశ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఆర్టీసీ డ్రైవర్‌కు 6 నెలల జైలు

కనిగిరి రూరల్: ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతిచెందిన కేసులో బస్సు డ్రైవర్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధించడంతో పాటు మృతుని కుటుంబానికి యాభై వేల రూపాయల పరిహారం చెల్లించాలని సోమవారం కనిగిరి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ జడ్జి కే భరత్‌చంద్ర తీర్పు చెప్పారు. కోర్టు సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. తర్లుపాడు మండలం చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆరికట్ల రామాంజనేయరెడ్డి కనిగిరిలోని ఒక సెల్ టవర్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. 2017 మే 24వ తేదీ ఉదయం విధులు ముగించుకుని తిరిగి తన స్వగ్రామానికి ఏపీ 27 బీఆర్ 1349 నంబర్ గల మోటార్ సైకిల్‌పై వెళ్తున్నాడు. ఆ సమయంలో శ్రీరంగాపురం వద్ద ఎదురుగా వచ్చిన ఏపీఎస్‌ఆర్టీసీకి చెందిన ఏపీ 29 జెడ్ 2099 నంబర్ గల బస్సు ఢీకొని రామాంజనేయరెడ్డి మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో మృతుని తండ్రి ఆరికట్ల గురుస్వామిరెడ్డి ఆర్టీసీ బస్సు డ్రైవర్ అతివేగం, అజాగ్రత్త వలనే తన కుమారుడు మరణించాడని కనిగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు డ్రైవర్ మానికాల బాలాజీపై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం సోమవారం కనిగిరి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ జడ్జి కే భరత్‌చంద్ర నిందితునికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు మృతుని కుటుంబానికి యాభై వేల రూపాయల పరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారు.

ఖైదీలపై సామాజిక వివక్ష నేరం

- కులం ఆధారంగా పనులు కేటాయించొద్దు
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.అమ్మన్న రాజా



కారాగారాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి అమ్మన్న రాజా

ఒంగోలు టౌన్: కారాగారంలోని ఖైదీలకు సామాజిక వర్గం ఆధారంగా పనులు కేటాయించడం నేరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.అమ్మన్న రాజా పేర్కొన్నారు. సోమవారం బోర్డ్ ఆఫ్ విజిటర్స్ ఆధ్వర్యంలో జిల్లా కారాగారాన్ని న్యాయమూర్తి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో వ్యక్తిగతంగా మాట్లాడి అక్కడి సదుపాయాలు, సౌకర్యాలు, ఖైదీలకు ఏ విధంగా పనులు కేటాయిస్తున్నారో ఆరా తీశారు. కుల ప్రాతిపాదికన పనులు చేయిస్తున్నారా అని ప్రశ్నించారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రకారం సమాజంలో అందరూ సమానమేనని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ సమాన అవకాశాలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.శ్యాంబాబు, జిల్లా జైలు సూపరింటెండెంట్ పి.వరుణారెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారి లక్ష్మీ ప్రసన్న, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, డీఈఓ ఎ.కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతల ఇటుక బట్టీలే టార్గెట్

- అక్రమంగా ఇటుకల బట్టీలను తొలగించడంపై మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు నిరసన
- 6 గంటలపాటు రోడ్డుపై బైఠాయింపు



రాయవరం వద్ద ఇటుక బట్టీల వద్ద కూర్చుని నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న అన్నా రాంబాబు

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలం రాయవరంలో వైఎస్సార్ సీపీ నాయకుల ఇటుకల బట్టీలే లక్ష్యంగా రెవెన్యూ అధికారులు ఆక్రమణల పేరుతో టీడీపీ నేతలు ఆక్రమించిన వాటిని మినహాయించి మిగిలిన బట్టీలను జేసీబీల ద్వారా సోమవారం ఉదయం 6 గంటల నుంచే తొలగింపు కార్యక్రమం చేపట్టారు. విషయం తెలుసుకున్న మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు రాయవరం గ్రామానికి వెళ్లి బట్టీల వద్ద కూర్చుని అధికారుల తీరును నిరసించారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా ఇటుకల బట్టీలు ఏర్పాటుచేసి జీవనం సాగిస్తున్న వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల బట్టీలను టార్గెట్‌గా పెట్టుకుని తొలగిస్తున్నారని ఆయన తహశీల్దార్‌తో అన్నారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు. మూడు రోజుల సమయం ఇస్తే ఆ బట్టీలను ఇతర ప్రాంతాలకు తరలించుకుంటారని, సమయం ఇవ్వాలని కోరారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ సబ్‌కలెక్టర్ వస్తున్నారని చెప్పడంతో అక్కడే అన్నా రాంబాబు కార్యకర్తలతో కలిసి రోడ్డుపై బైఠాయించారు. ఎంతసేపటికీ రాకపోవడంతో అన్నా రాంబాబు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు. గ్రామంలో పలువురు టీడీపీ నేతల ఆక్రమణల్లో ఉన్న వాటిని అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిచ్చింది. అన్నా రాంబాబు వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సత్యనారాయణ, పొందుగుల శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు. రూరల్, పట్టణ ఎస్సైలు అంకమరావు, సైదుబాబు, రాజమోహన్‌రావు తమ సిబ్బందితో అక్కడికి వచ్చి బందోబస్తును పర్యవేక్షించారు.

ఆరో రోజు పరీక్షలకు 319 మంది..



లాంగ్ జంప్ చేస్తున్న అభ్యర్థి

ఒంగోలు టౌన్:పోలీసు కానిస్టేబుల్ నియామకాలకు సంబంధించి అభ్యర్థులకు స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలు సోమవారం ఆరో రోజు కొనసాగాయి. 600 మందికిగానూ 319 మంది హాజరయ్యారు. సర్టిఫికెట్లను పరిశీలించిన అనంతరం ఎత్తు, ఛాతి, తదితర పరీక్షలు నిర్వహించారు. అనంతరం పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించారు. 233 మంది తదుపరి పరీక్షలకు అర్హత సాధించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవల్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు సూచించిన నియమాల ప్రకారం ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పకడ్బందీగా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని సూచించారు. ఈవెంట్స్‌లో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, పీటీసీ డీఎస్పీ మాధవరెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, పీటీసీ డీఎస్పీ లక్ష్మణ్ కుమార్, డీపీఓ ఏఓ రామ్మోహన్‌రావు, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, ఆర్‌ఐలు సీతారామిరెడ్డి, రమణారెడ్డి, డీపీఓ, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ పార్కింగ్ విషయంలో వివాదం



తల పగిలి తీవ్రంగా గాయపడిన ఎర్రమౌలాలి



తలపగిలిన బాదుల్లమ్మ

- రాళ్లు, బీరు సీసాలు, కర్రలతో పరస్పర దాడి
- ఘర్షణలో 2 కుటుంబాలకు చెందిన 8 మందికి గాయాలు

బేస్తవారిపేట: మోటారుసైకిల్ ఇంటి వెనుక పార్కింగ్ చేయడంతో ఏర్పడిన వివాదం ఇరు కుటుంబాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ సంఘటన బేస్తవారిపేటలోని ఏపీజీబీ బ్యాంక్ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. దూదేకుల ఏర్రమౌలాలి, మరి కొందరు గృహాల వెనుకవైపున మోటార్‌సైకిళ్లు పెట్టుకుంటున్నారు. రెండు రోజుల క్రితం దూదేకుల ఖలీల్, సద్దాంహుస్సేన్ అదే వీధిలోకి కారు వెళ్లేందుకు ఇబ్బందికరంగా ఉందని అసభ్యకరంగా మాట్లాడాడు. ఎవరిని తిడుతున్నావని ఎర్రమౌలాలి ప్రశ్నించడంతో 'నిన్ను కాదు వేరే వాళ్లను' అని చెప్పాడు. సోమవారం ఉదయం పూటుగా మద్యం తాగిన సద్దాంహుస్సేన్ మహిళలను తిడుతున్న క్రమంలో ఇరు కుటుంబాలు ఘర్షణకు దిగాయి. రాళ్లు, బీరు సీసాలు, కర్రలు ఒకరిపై ఒకరు విసురుకోవడంతో ఇరు వర్గాల్లోని ఎనిమిది మందికి గాయాలయ్యాయి. దారిన పోతున్న గురవమ్మ అనే మహిళకు బీరు సీసా తగలడంతో గాయపడింది. ఒక కుటుంబంలోని దూదేకుల బాదులమ్మ, ఎర్రమౌలాలి, మౌలాబి, నడిపిమౌలాలి, మరో కుటుంబంలో సద్దాంహుస్సేన్, అబ్దుల్ ఖలీల్, హల్లెమ్మకు గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అబ్దుల్ ఖలీల్ గతంలో ఇదే వీధిలో పలువురిపై దౌర్జన్యం చేసి భయభ్రాంతులకు గురిచేశాడని కాలనీవాసులు ఆరోపించారు. క్షతగాత్రులను 108లో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



తీవ్రంగా గాయపడిన సద్దాం హుస్సేన్